ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్



- రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్

2లో...

రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలు



- ఖానాపూర్ నుండి రాథోడ్ రమేష్, మంచిర్యాల, బెల్లంపల్లిలో స్వతంత్ర అభ్యర్థులు
- మిగిలి ఉంది ఆరు రోజులే..

2లో...



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | ఆదివారం | నవంబర్ 5, 2023 | www.navatelangana.com

'కండువా' మారుతోంది..!

- పార్టీలు మారుతున్న నాయకులు, కార్యకర్తలు
- రాజకీయ పార్టీల్లో ఊపందుకున్న చేరికల పర్వం
- ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో రసవత్తరంగా మారుతున్న రాజకీయం

నిన్నటి వరకు ఒక కండువా కప్పుకున్న నాయకులు..రేపటి కల్లా మరో రంగు కండువా ధరించి కనిపిస్తున్నారు..అప్పటి వరకు ఓ అభ్యర్థికి జై కొట్టిన కార్యకర్తలు..మరుక్షణమే మరో అభ్యర్థి వద్ద ప్రత్యక్షం కావడం ఆసక్తి రేపుతోంది. కండువా తీసి..మరో కండువా కప్పుకున్నంత సులువుగా పార్టీ మార్పుల ప్రక్రియ జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పర్వం రంగులు మారుతోంది. ఆయా పార్టీల ముఖ్య నాయకులతో పాటు కింది స్థాయి కేడర్ సైతం ఆయా పార్టీల్లో చేరుతుండటంతో ఏ నాయకుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియక అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు సైతం చేరికల పర్వానికి అధిక ప్రాధాన్యం ఇస్తుండటం..మండల, గ్రామ స్థాయిలో ప్రజల్లో పట్టున్న నాయకులను మచ్చిక చేసుకొని ఆయా పార్టీల్లో చేర్పించుకోవడం సాధారణ ప్రక్రియగా మారడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు మిగితా పార్టీల్లోనూ చేరికల పర్వం ఊపందుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్న మర్సుకోల సరస్వతి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గోవర్ధన్‌రెడ్డి, గణపతిరెడ్డి తదితరులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు చేరికలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రజల్లో మంచి పేరు కలిగి.. రాజకీయంగా మంచి పట్టున్న నాయకులను చేర్పించుకోవడంలో ఆయా పార్టీలు పోటీపడుతున్నాయి. పార్టీలో పాటు ఆయా నాయకులు వారి రాజకీయ భవితవ్యం కోసం పార్టీలు మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే భవిష్యత్తులో మంచి పదవి ఇస్తామని..ప్రభుత్వంలో

మిగతా..2లో...

భూ పోరాటంలో పాల్గొన్న చరిత్ర



- బడుగు, బలహీన వర్గాల కోసం ఉద్యమించిన కుటుంబం
- పేదల కోసమే జీవితం అంకితం
- నవతెలంగాణతో బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వన్నెల అశోక్

వివరాలు..2లో...



అవసరం..అనివార్యం..!

- చెన్నూర్ బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వివేక్ వెంకటస్వామి

చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టికెట్ ఆశించిన అందరికి భంగపాటేనా? అంటే అవుననే సమాధానం విన్పిస్తోంది. ఇక్కడ బలంగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌ను ఎదుర్కొనేందుకు ఆర్థిక, అంగబలం కలిగిన అభ్యర్థి అవసరం..అనివార్యం అనే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకుల భావిస్తున్నారు. ఫలితంగా టికెట్ ఆశించిన వారిని పక్కన పెట్టి బీజేపీలో కీలక బాధ్యతల్లో ఉన్న మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామిని తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు చెన్నూర్ అసెంబ్లీ టికెట్ ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. పోలింగ్‌కు మరో 25రోజుల సమయం మాత్రమే ఉండగా ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రచారంలో ముందు వరుసలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి ఇంకా నియోజకవర్గంలో అడుగు పెట్టకపోయినా స్థానిక నాయకులు, క్యాడర్‌తో కలిసిపోయే పనిలో ఉన్నారు.



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలో ఈ సారి పోటీ రసవత్తరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న

మిగతా..2లో...

రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు దాఖలవుతున్నాయి. తొలి రోజున ఉమ్మడి జిల్లాలో 8 నామినేషన్లు రాగా.. శనివారం మూడు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారులు చెబుతున్నారు. ఖానాపూర్ నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న రాథోడ్ రమేష్ నామినేషన్ దాఖలు చేయగా.. మంచిర్యాల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పంబాల మహేందర్ నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినేషన్లు వేసేందుకు మరో ఆరు రోజులు సమయం మాత్రమే మిగిలి ఉంది.

(మొదటి పేజీ తరువాయి)

'కండువా' మారుతోంది..!

ప్రాధాన్యం ఇస్తామని ఆయా పార్టీల అగ్రనాయకులు హామీలు ఇస్తూ పార్టీల్లో చేరేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క కొందరు నాయకులు ఆయా పార్టీల తరపున టికెట్లు ఆశించి దక్కని వారు సైతం ఆ పార్టీలను విడిచిపెట్టి మరో పార్టీలోకి చేరుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. కొందరు నాయకులు మాత్రం ఆయా పార్టీలు తీసుకునే నిర్ణయాల పట్ల అసంతృప్తికి గురై పార్టీ మారుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఈ పరిణామాలు మరింత అధికమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో చాలా మంది ముఖ్య నాయకులు కండువాలు మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పార్టీలు మారిన కీలక నాయకులు..!

ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో ఏండ్ల పాటు కొనసాగిన యాసం నర్సింగ్‌రావుతో పాటు మరికొందరు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ పార్టీలో ఉన్న బాలూరి గోవర్దన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. బోథ్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాథోడ్ బాపురావుకు టికెట్ లభించకపోవడంతో ఇటీవల బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు టికెట్ లభించకపోవడంతో ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నం చేసిన మర్సుకోల సరస్వతికి నిరాశ ఎదురుకావడంతో తాజాగా బీఆర్ఎస్ కండువా కప్పుకొన్నారు. ముధోల్‌లో బీజేపీ టికెట్ ఆశించి నిరాశకు గురైన డా.రమాదేవీ బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవలి వరకు బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్న డా.వివేక్ వెంకటస్వామి తాజాగా కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంచిర్యాలలో హాజీపూర్ జడ్పీటీసీ శిల్ప, దండేపల్లి ఎంపీపీ శ్రీనివాస్‌లు కాంగ్రెస్‌లో చేరగా.. కాంగ్రెస్‌కు చెందిన లక్షెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య బీఆర్ఎస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిర్పూర్(టి) జడ్పీటీసీ నీరటి రేఖ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఇటీవల బీజేపీలో చేరారు. ఇలా ముఖ్య నాయకులతో పాటు కింది స్థాయి క్యాడర్, ఆయా గ్రామాల్లో పట్టు కలిగిన నాయకులు అనేక మంది పార్టీలు మారుతుండటం ఆసక్తి రేపుతోంది. ఇటీవల వరకు ఒక పార్టీకి అనుకూలంగా పనిచేసి..కొద్దిరోజుల్లోనే మరో పార్టీని గెలిపించాలని ప్రచారం చేస్తుండటం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

అవసరం..అనివార్యం..!

పథకాలతో ఓటర్లు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారనే ధీమాతో బీఆర్ఎస్ నాయకులున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బాల్క సుమన్ గెలుపు అవసరమని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. మరోసారి టికెట్ దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇప్పటికే మూడు మున్సిపాల్టీలతో పాటు మండలాల్లో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగనున్న వివేక్ వెంకటస్వామి సైతం గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డనున్నారు. దీంతో నియోజకవర్గంలో పోటీ నువ్వా నేనా అనే రీతిలో సాగనుంది. కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకెళ్లేలా ప్రణాళికలు రచిస్తోంది. బీఆర్ఎస్ అసంతృప్త నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అని తెలిసిన మరుక్షణం నుండి అనునాయులతో మంతనాలు జరుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. బీఆర్ఎస్ సర్పంచులుగా ఉన్న వారితో పాటు నామినేటెడ్ పోస్టుల్లో కొనసాగుతున్న నాయకులు వివేక్ వెంకటస్వామితో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ

చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ఎంత మంది ఉన్నప్పటికీ అధికార బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి మధ్యనే పోటీ ఉండబోతోంది. బీజేపీకి ఇక్కడ అంతగా బలం లేదు. స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం కూడా అంతగా ఉండదు. తెలుగుదేశం ఆవిర్భావానికి ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొందారు. తెలుగుదేశం ఏర్పాటు తర్వాత నాలుగు పర్యాయాలు ఆ పార్టీకి ఎదురు లేకుండా పోయింది. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత బెల్లంపల్లి అభ్యర్థి గడ్డం వినోద్ పోటీ చేసి గెలుపొందారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలైప్పటి నుండి నియోజకవర్గ ప్రజలంతా తెలంగాణ ఆకాంక్షతో టీఆర్ఎస్ పార్టీని నెత్తిన పెట్టుకున్నారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ అభ్యర్థిగా నల్లాల ఓదెలు ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలుపొందారు. ఆ తదుపరి ఓదెలు స్థానంలో పోటీ చేసి గెలిచిన ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మరోమారు గెలిచి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలని ఆశ పడుతున్నారు.

కాంగ్రెస్‌తోనే ఉంటా...వివేక్ గెలుపుకు కృషి చేస్తా.. : మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

ఎమ్మెల్యే టికెట్ ఆశించి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తనకు టికెట్టు ఇవ్వకపోయినా పార్టీలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటున్న మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి గెలుపుకు కృషి చేస్తానని పేర్కొంటున్నారు. చెన్నూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

భవిష్యత్తు ప్రశార్థకమైంది...పార్టీ గెలుపు కోసం పని చేయడమే..! : డాక్టర్ రాజా రమేష్

నియోజకవర్గంలో గ్రామాల వారీగా తిరిగి పార్టీ పటిష్టతకు రాత్రింబవళ్లు శ్రమించినా అధిష్టానం గుర్తించలేదు. అయినా అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పార్టీలో కొనసాగాలని నిర్ణయించుకున్నట్టు డాక్టర్ రాజారమేష్ తెలిపారు. భవిష్యత్తు ప్రశార్థకంగానే కన్పిస్తున్నా పార్టీ అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా పని చేస్తాం. టికెట్ ఆశించి భంగపడిన వారిలో ఒకరైన రాజారమేష్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని, టికెట్ కేటాయించకపోయినా విమర్శలకు పోయేది లేదని పేర్కొంటున్నారు.


భూ పోరాటంలో పాల్గొన్న చరిత్ర

నవతెలంగాణ-తాంసి

బడుగు బలహీన వర్గాల కోసం రజాకర్లకు వ్యతిరేకంగా భూ పోరాటం నిర్వహించి జైలుకు వెళ్లిన కుటుంబం. తాత కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ పేదల కోసం ఉద్యమించారు. నేడు మనవడు ప్రజా సేవ కోసం బోథ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నాడు. డాక్టర్ వన్నెల అశోక్ నేపథ్యం ఇది. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ పొందిన ప్రచార పర్వంలో ఉన్న ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తాత వన్నెల ఎల్లన్న కమ్యూనిస్టు పార్టీలో పేదలకు భూమి కోసం రజకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించి జైళుకు వెళ్లారన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన తనకు పేదల సమస్యలపై అవగాహన ఉందన్నారు. మరో తాత వన్నెల గంగారెడ్డి బోథ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారని తెలిపారు. వారి స్ఫూర్తిగా తను కూడా రాజకీయాల్లో ఆరంగేట్రం చేశానని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా మారుమూల గ్రామాల్లో వన్నెల ట్రస్ట్ ద్వారా ఉచిత ఆరోగ్య క్యాంపులు నిర్వహించి మందులు అందించామన్నారు. డాక్టర్‌గా తాను డబ్బు సంపాదించాలంటే ఆ వృత్తినే కొనసాగించేవాడినని, పేద ప్రజలకు, ఆదివాసుల అభ్యున్నతికి తన వంతుగా ఏదో చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. గెలిచిన తర్వాత ఆదివాసీ పిల్లల చదువు కోసం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన మత్తడి వాగు ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసే కుడి, ఎడమ కాలువలకు మరమ్మత్తులు చేసి పిల్ల కాలువలు నిర్మించి రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మిషన్ భగీరథలో జరిగిన అవినీతిని బయటపెడతామన్నారు. తెలంగాణతో పాటు బోథ్‌లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లంచం తీసుకుంటూ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల మామడ ఎస్సై ఓ కేసులో లంచం తీసుకుంటూ పట్టుబడగా, తాజాగా నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పట్టుబడ్డట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్(జి) మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన కలీం తన ఇంటిని గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం గత నెల 31న కార్యాలయానికి వెళ్లాడు. జూనియర్ అసిస్టెంట్ అరుణ్, ప్రయివేట్ అసిస్టెంట్ రాజేందర్ రూ.8వేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి దగ్గర లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. విచారణ జరుపుతున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

దుప్పి కొమ్ములు లభ్యం

నవతెలంగాణ-భీమారం

పోలంపల్లి శివారు అటవీ ప్రాతంలో దుప్పి కొమ్ములు లభ్యమయ్యాయి. శనివారం ఉదయం సమీప గ్రామ మహిళలు చీపురు పుల్లల కోసం అటవీ ప్రాంతానికెళ్లగా వారికి దుప్పి కొమ్ములు కనిపించాయి. దీంతో అక్కేడే ఉన్న వాచర్లకు విషయం చెప్పారు. వారు పైఅధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మంచిర్యాల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాగరిక ఆ ప్రాంతానికి వెళ్లి కొమ్ములను స్వాధీపర్చుకున్నారు. దుప్పి వేట ఉచ్చులో చిక్కుకుందేమో అన్న కోణంలో పరిశీలించామని, అలాంటి ఆనవాళ్లేమీ తమకు లభించలేదని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. కాలానుగుణంగా దుప్పి కొమ్ముల్లో మార్పులు జరిగి ఇలాంటి సందర్భాలు ఏర్పడతాయని లేదా ఒకదానితో ఒకటి పోట్లాడినప్పుడు, చెట్ల కొమ్మలో చిక్కుకున్నప్పుడు దుప్పి నుంచి ఇలా కొమ్ములు వేరు పడటానికి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

రూ.80,160 నగదు సీజ్

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద శనివారం పోలీసులు రూ.80,160 నగదు పట్టుకున్నారు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆసిఫాబాద్ మండలానికి చెందిన శ్రీహరి వాంకిడి నుండి ఆసిఫాబాద్‌కు వెళ్తున్నాడు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా నగదు కనిపించింది. నగదుకు సంబంధించి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఎవరైన రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తరలిస్తే వాటికి సంబంధించిన పత్రాలు ఉండాలని, లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులకు సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
ఆదివారం నవంబర్ 05, 2023

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

నవతెలంగాణ-సారంగాపూర్

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ భోల్లోజి నర్సయ్య అన్నారు. శనివారం మండలంలోని జౌలీ గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల కర పత్రాలను చూపుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావుకు ఓటు వేయాలని అన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఓటర్లను కోరారు. ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ ఆది, మారుతీ, సునీత, సాకోపెల్లి సురేందర్, తేజ్ నాయక్, నాయకులు రాజారెడ్డి, ముత్యంరెడ్డి, సలీమ్, మహేందర్, మహేష్, జౌలీ రవీందర్‌రెడ్డి, ముక్కార్, షఫీ పాల్గొన్నారు.



కార్మిక, నిరుద్యోగుల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

● సీపీఐ(ఎం) నిర్మల్ డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-నిర్మల్

నిత్యం కార్మిక సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై మరో పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని, రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక పాలనను ఓడించాలని సీపీఐ(ఎం) నిర్మల్ డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, నిరుద్యోగులకు ఉద్యోగులకు ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వడం లేదని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం చూపడం లేదని తెలిపారు. కార్మికులు, సమస్యల పరిష్కారానికి సమ్మెలోకి వెళ్తే సమ్మె చేసే కార్మికులతో, యూనియన్ లతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని మంత్రులు మాట్లాడుతున్నారని అన్నారు. అటువంటి బీఆర్ఎస్, బీజేపీల ప్రభుత్వ మెడలు వంచి అంగన్వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, ఐకేపీ వీఓఏ, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమ్మెలలో మంత్రులు స్వయంగా సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపారని, కొన్ని ఒప్పందాలు అయ్యాయని తెలిపారు. ఆ హామీలను తుంగలో తొక్కి మళ్లీ సమ్మె కాలపు వేతనాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని అన్నారు. ఈ మహిళా కార్మికులకు చట్టబద్ధంగా అమలు కావాల్సిన చట్టాలు అమలు కావడం లేదని అన్నారు. రోజు రోజుకు పని భారాన్ని పెంచుతూ, పని గంటలను ప్రభుత్వాలు పెంచుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ సమస్యలపై ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే పార్టీలను, అభ్యర్థులను నిలదీసి, కార్మికుల సమస్యలపై వైఖరేమిటి చెప్పాలని డిమాండ్ చేయాలని అన్నారు. సమావేశంలో నిర్మల్ ఏరియా కమిటీ సభ్యులు పోశెట్టి, క్లైమెంటు వెస్లీ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, అధిక్ పాల్గొన్నారు.

మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి 24వ రోజు చేరుకుంది. గ్రామ మైనారిటీ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేండ్ల కిందటే గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు, అధికారులకు, విన్నవించామని అన్నారు. మండలంగా ప్రకటిస్తామని చెప్పి, మోసగించి వేరే గ్రామాన్ని మండలంగా ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామం మండలం కావడానికి, అన్ని అర్హతలు కలిగి ఉందని అన్నారు. తక్షణమే మండలంగా ప్రకటించాలని, లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తామని, మండలంగా ప్రకటించే వరకు నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంఘం సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రజలు, యువకులు, పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పొట్యా గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పొట్యా గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అలుకొండ వైష్ణవి(17) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవికి కొంత కాలంగా తల నొప్పితో బాధపడుతూ ఉంది. వైద్యులకు చూపించినా తగ్గక పోవడంతో మనస్థాపానికి గురై శనివారం ఇంటిలో ని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి దత్తన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాసర క్షేత్రంలో నిర్మించే వసతి గృహానికి విరాళం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని నిగ్వ గ్రామానికి చెందిన డాక్టర్ కిరణ్ కుమార్ కొమ్రేవార్ శనివారం ముధోల్ మున్నూరుకాపు తాలూకా అధ్యక్షుడి ఆధ్వర్యంలో బాసర పుణ్య క్షేత్రంలో నిత్యా అన్నదాన సత్రం స్థలం కొనుగోళ్లు చేసేందుకు తన వంతుగా రూ.5లక్షల 11 వేల ఒక రూపాయిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు తాలూకా అధ్యక్షుడు రోల్లా రమేష్ మాట్లాడుతూ డాక్టర్ కిరణ్ కుమార్ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తారని అన్నారు. వైద్య వృత్తిలో ఎనలేని సేవలు అందించి, పేద ప్రజలకు ఆర్థిక సాయం అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు రమేష్, కార్యవర్గ సభ్యులు చిమ్మన్ పోశెట్టి, కొర్వ సదానంద్, విఠల్, శ్రీనివాస్, లోకేశ్వరం అధ్యక్షుడు లింగన్న, తానూర్ అధ్యక్షుడు పోశెట్టి, ముధోల్ సంఘం ప్రధాన కార్యదర్శి పోశెట్టి, కుల సంఘాల అధ్యక్షులు సభ్యులు ఉన్నారు.

మాడేగాం గ్రామం దిగ్బంధం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

గ్రామ దేవతలకు పండుగలు చేస్తున్న నేపథ్యంలో మండలంలోని మాడేగాం గ్రామాన్ని ఆదివారం దిగ్బంధం చేస్తున్నట్టు గ్రామ పెద్దలు శనివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. పండుగ పూర్తి అయ్యేవరకు ఎవరూ గ్రామంలోకి రాకూడదని, గ్రామం నుంచి ఎవరూ పొలిమేర దాటి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా అత్యావసర ప్రయాణం సాగించేవారు కదిలి, కుస్లి గ్రామాల గుండా వెళ్లాలని సూచించారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్

● కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ఉంటుందని డీసీసీ అధ్యక్షులు, నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణం విశ్వనాథ్‌పేట్ కాలనీ 22వ, వార్డులోని గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ ప్రకటించిన అభయ హస్తం హామీలను, 6 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అందరికి అండగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో అన్యాయం చేశారని అన్నారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో రాష్ట్రాన్ని సాధించుకుంటే అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఉద్యోగులు గాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయని అసమర్థత ముఖ్యమంత్రి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా సకాలంలో వేతనాలు ఇవ్వలేని ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బహుమతి ఇద్దామని అన్నారు. నిర్మల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక...

సోన్ మండల కేంద్రానికి చెందిన పలువురు గాండ్ల సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. నిర్మల్ మండలంలోని ఎల్లారెడ్డిపేట్, రత్నాపూర్ కాండ్లీ, గోపాల్‌పేట్, రాణాపూర్, సోనాపూర్, గ్రామాల నుంచి సైతం శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సాద సుదర్శన్, భీమ్‌రెడ్డి, వేణు, శేఖర్, సలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

పోలీసుల తనిఖీల్లో శనివారం రూ.లక్షా నగదు పట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన సిరిపెల్లి(హెచ్) వద్ద ఎన్నికల్లో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రలోని పాలాజ్ నుంచి భైంసాకు వస్తుండగా సిరిపెల్లి(హెచ్) గ్రామం వద్ద మహారాష్ట్రకు చెందిన రాజేశ్వర్ వద్ద రూ.లక్షా నగదును పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్టు కుభీర్ ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని అన్నారు. గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఆధారాలు లేని నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

బీఆర్ఎస్‌లో చేరిన మర్సకోల సరస్వతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ఆశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సకోల సరస్వతి టికెట్ రాకపోవడంతో నిరాశ గురైన ఆమె శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెతోపాటు తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్యలతో పాటు కార్యకర్తలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుల ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లి మంత్రి కేటీఆర్, ఐకే రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జిల్లాలో బీఆర్ఎస్ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్‌లో గుర్తింపు ఇవ్వకపోవడంతోనే తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సరస్వతి తెలిపారు. నియోజకవర్గంలో ఆదివాసీలనంత ఐక్యం చేసి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు అబ్దుల్లా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి

● డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం

నవతెలంగాణ-రెబ్బెన

గత ఐదేండ్ల కింద ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గురుకుల పాఠశాల భవనం మంజూరు చేసి బీసీ సంక్షేమ హాస్టల్లో సుమారుగా 500 మంది విద్యార్థినిలతో తరగతులు ప్రారంభించాని తెలిపారు. ఇప్పటికే ఐదు సంవత్సరాలు గడుస్తున్నా పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు వర్షం నీటితో ఊరుస్తుంటాయన్నారు. ఎక్కువ వర్షం కురిస్తే విద్యార్థులు ఇంటికి పోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. రాత్రి నిద్రపోవడం, 500 మంది విద్యార్థులకు 10 మూత్రశాలలు ఉండడం, తాగ్నెంట్రీ లేకపోవడం, భోజనశాల కూడా సరిగా లేకపోవడం, ఒకే గదిలో 80 మంది విద్యార్థులు పడుకోవడంతో విద్యార్థినిలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి రెబ్బెన గురుకుల హాస్టల్‌కు సొంత స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసి నూతన భవనం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, చల్లూరి కార్తీక్, నాయకులు కృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం

వారసంతలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మిని గెలిపించాలని కోరుతూ శనివారం ఆ పార్టీ నాయకులు వార సంతలో ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక జమేదాబాబ దర్గాలో ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. రాష్ట్రంలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అన్సర్, సయ్యద్ నిసార్, ఎండీ అహ్మద్, షబ్బీర్, ఎం పోషన్న, బీఆర్ఎస్వీ నాయకుడు రాజ్ కుమార్, సమీర్ ఖాన్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

● 800 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం

నవతెలంగాణ-రెబ్బెన

గుడుంబా తయారుచేస్తున్నారనే సమాచారం మేరకు మండలంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. మండలంలోని రాళ్లపేట, సింగిల్‌గూడ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. రాళ్లపేటలో గుడుంబా విక్రయిస్తుండగా దాడిచేసి ఐదు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు, గ్రామ పరిసర ప్రాంతాల్లో 800 లీటర్ల బెల్లంపాకం ధ్వంసం చేసి, ఐదు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ఎవరైన గుడుంబా తయారుచేసిన, మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ ధర్మప్రకాష్, కానిస్టేబుళ్లు సురేష్, మహేష్, మమత పాల్గొన్నారు.

రెండవ రోజు నామినేషన్లు నిల్

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్, బోథ్ శాసన సభ నియోజకవర్గాలకు రెండవ రోజు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సంబంధిత ఆర్ఓలు నామినేషన్లను స్వీకరించారు. ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆదివారం సెలవు నామినేషన్లు స్వీకరించబడవని కలెక్టర్ తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియలో ఆదిలాబాదు, బోథ్ రిటర్నింగ్ అధికారులు బి. ప్రవంతి, చాహాత్ బాజ్‌పాయ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి



నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని నారాయణపూర్, కొమురవెల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, ట్యాక్స్ చైర్మన్ కార్నాథం సంజీవ్, వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, నాయకులు పల్లె ప్రకాష్‌రావు, చిరంజీవిగౌడ్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

జైలు జీవితంతో ప్రవర్తనలో పరివర్తన రావాలి

● జిల్లా జడ్జి ఎంవీ.రమేష్

● ఘనంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలో పరివర్తన రావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జిల్లా జడ్జి ఎంవీ.రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో నిర్వహించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల ఒక కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. జైలులో నేర్చుకున్న పలు మంచి అంశాలు నిత్య జీవితంలో అనుసరించాలని సూచించారు. నేర ప్రవృత్తి వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కక్షిదారులు కూర్చుని మాట్లాడుకుంటే అనేక అంశాలకు పరిష్కారాలు దొరుకుతాయని తెలిపారు. ప్రతి వ్యక్తి మెడిటేషన్ చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల పనిపై శ్రద్ధ పెరగడంతో పాటు తప్పులు చేసే అవకాశం తగ్గుతుందన్నారు. మంచి చెడులను బేరీజు వేసుకొనే శక్తి వస్తుందన్నారు. అంతకు ముందు జైలు సిబ్బంది జిల్లా జడ్జికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్ కుమార్, అడ్వకేట్లు చంద్రకుమార్, నరహరి, గణేష్, రాజీవ్ రెడ్డి లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



11న ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభ



నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 11న హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ తెలిపారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాసభకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్గీకరణకు 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న, మాదిగ ఉపకులాల ప్రజలకు సంక్షేమ, రాజకీయ, విద్య, ఉపాధి రంగాలలో తీవ్రమైన అన్యాయం జరుగువస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. 11న జరిగే సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి నవీన్, ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, మాదిగ లాయర్ల జిల్లా బాధ్యులు నాతరి రాజు, మండల అధ్యక్షుడు మహేష్, సీనియర్ నాయకులు కొమ్ము రవి, దొనకొండ ప్రశాంత్, ప్రసాద్ ఉన్నారు.

బేల : ఈనెల 11న హైదరాబాదు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు మేకల జితేందర్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ మాదిగల ఆవేదన ప్రపంచానికి చాటే విధంగా ప్రతి ఇంటి నుండి మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేసి ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, ప్రచార కార్యదర్శి రొడ్డ రాజశేఖర్, అడ్డికి సునీల్ కుమార్, మేకల దీపక్, సకిపెల్లి రాకేష్, దినేష్ పాల్గొన్నారు.

విద్యావంతుడైన జాన్సన్ నాయక్‌కే మా మద్దతు



యువకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న భూక్యా జాన్సన్ నాయక్

నవతెలంగాణ-కడెం

విద్యావంతుడైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌కే మా మద్దతని మండలంలోని కన్నాపూర్ గ్రామస్తులు తెలిపారు. శనివారం లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు జెడ్పీటీసీ జానుబాయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా కన్నాపూర్ గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి భూక్యా జాన్సన్ నాయక్ బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకోవడానికి ఢిల్లీ జమీందార్లు వలసలుగా వస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో నుంచి గులాబీ జెండాను విడదీయలేరని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ఎజెండాగా ప్రజలకు సేవలు అందిచడానికి వచ్చిన నాయకుడని అన్నారు. మండలంలోని కన్నాపూర్ గ్రామ పెద్దలు భూత్యార్ మల్లేష్, బాస నరేష్, గోపాల్, సిరికొండ గంగాధర్, సతీష్, మహేష్, దానవేని రాజేందర్, పిల్లి నాగరాజ్ అంగిశకుల మధుకర్, మణి, కొమిరె గంగాధర్, శనిగారపు లక్ష్మీరాజం, బైరి అంజన్న జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి కరుణాకర్, ముల్కం రమేష్, తుమ్మల చంద్రయ్య, దాసండ్ల లక్ష్మీనారాయణ, దాసండ్ల కిషన్, జొన్నలగడ్డ చంద్రశేఖర్, నల్ల జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో యువత చేరికతో నూతనోత్తేజం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలతో యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతుండడం నూతనోత్తేజాన్ని నింపుతోందని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఆయన సమక్షంలో గణేష్ నాయుడు ఆధ్వర్యంలో రాంపూర్, షాద్‌నగర్, బంగారుగూడ, సుందరయ్య నగర్ కాలనీలకు చెందిన యువకులు చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, తమ ప్రభుత్వ హయంలో చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరడం పట్ల ఆనందంగా ఉందన్నారు. బీజేపీకి మాత్రమే యువత మద్దతు ఉంటుందన్న అపోహలను పటాపంచలు చేస్తూ సుమారు పదివేల మంది యువకులు తమ పార్టీలో చేరారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం సీసీఐ పునరుద్ధరణపై స్పందించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిసి వివరించిన ఫలితం లేదన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ ప్రకాష్, కొండ గణేష్, దమ్మపాల్, రామ్‌కుమార్, అష్రఫ్, శివకుమార్, వాగ్మారే ప్రశాంత్, లింగారెడ్డి, అత్తరుల్లా పాల్గొన్నారు.

ఆశమ్మపై సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మపై ఉన్న సస్పెన్షన్ వేటు ఎత్తివేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగురామన్న పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆశమ్మపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి, పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దీంతో పద్మశాలి సంఘంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆశమ్మ పార్టీలోకి తిరిగి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నవతెలంగాణ-నార్నూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఉపసర్పంచ్ విష్ణు ఫడ్ అన్నారు. శనివారం తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీకాంత్ స్మారక మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి తాడిహత్నూర్ జాగుర్ క్రికెట్ క్లబ్‌కు రూ.25 వేలు, రెండో బహుమతి జైనూర్ క్రికెట్ క్లబ్‌కు రూ.12 వేలు అందించారు. ఇందులో టోర్నమెంట్ నిర్వహకులు రాథోడ్ శ్రీనివాస్, విజయ్, శశాంక్, వార్డు సభ్యులు ఉన్నారు.

షాప్ యజమానులపై కోడ్ ఉల్లంఘున కేసు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి రాత్రి 10 దాటినా తర్వాత ఆయా షాపు యజమానులు తమ వ్యాపారం కొనసాగించగా వారిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎస్సై కలీం ఆధ్వర్యంలో తనిఖీ చేయగా కటింగ్ షాప్, ఓ బేకరీ, ఒక కిరణ షాప్, జ్యూస్ సెంటర్ యాజమనులు రాత్రి 10 దాటిన వ్యాపారం కొనసాగిస్తూ కోడ్ ఉల్లగించగా వీరిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. రాత్రి 10 తర్వాత వ్యాపారాలకు అనుమతి లేదన్నారు.

నేడు జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికల కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్.ఈఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీహెచ్ కాంతారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి అర్హత కలిగిన బాలబాలికలు సంబంధిత వయసు ధృవీకరణ పత్రం, బోనాఫైడ్‌తో ఉదయం 10 గంటలకు పోటీల ఆర్గనైజర్ మిట్టు దత్తుకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఆయిల్‌ఫామ్ పంట సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ హార్టికల్చర్ కమిషనర్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని రిటైర్డ్ హార్టికల్చర్ కమిషనర్ వెంకట్‌రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు శనివారం ఆయిల్‌ఫాం పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆయిల్‌ఫాం కన్సల్టెంట్ జీవి సుబ్బారెడ్డి, వెంకటరాంరెడ్డిలు మాట్లాడుతూ అత్యధిక రైతులు ఇప్పుడు ఆయిల్‌ఫాం పంట సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారని అన్నారు. ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా రైతులకు అవగాహన కల్పించి, ఎక్కువ మొత్తంలో ఆయిల్‌ఫాం పంటను పండించడానికి ప్రోత్సాహించడంతో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పదివేల ఎకరాల్లో ఆయిల్‌ఫాం పంట సాగు చేస్తున్నారని తెలిపారు. ఆయిల్‌ఫాం పంట సాగుతో రైతులు అత్యధిక లాభాలు గడించవచ్చని, అంతర పంటలు కూడా సాగుచేసి అత్యధిక లాభాలు గడించవచ్చని తెలిపారు. ఈ పంట సాగు చేసేందుకు రైతులు ఎక్కువ మొత్తంలో ముందుకు రావాలని కోరారు. వెంకటరాంరెడ్డి తన తోటలో సరికొత్త రీతిలో ఆయిల్‌ఫాం పంటలో వరి పంటను కూడా సాగు చేసి సంచలనం సృష్టించారని పేర్కొన్నారు. ఆ పంట సాగు విధానాన్ని చూసేందుకు రైతులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ మేనేజర్ మనోజ్ కుమార్, సీనియర్ అగ్రినామిస్ట్ పాపిరెడ్డి, సుధాకర్, సేల్స్ ఆఫీసర్ కుమార్, ఎఫ్ఎస్ ఆయిల్‌ఫాం కన్సల్టెంట్ బీఎన్ రావు, డీఏఓ అంజిప్రసాద్, ఎఈఓ అనురాధ, శ్రీవాణి, ఫర్టిలైజర్ యజమానులు ముస్కు ముత్యంరెడ్డి, కోడె ముత్యం, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి



ప్రచారంలో పాల్గొన్న కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్, వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లింగాపూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్‌తో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. గత 33 ఏండ్లుగా ఖానాపూర్ నియోజవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే ఖానాపూర్‌ను అభివృద్ధి చేసి చూపెడతానని అన్నారు. గతంలో రాథోడ్ రమేష్ ఎమ్మెల్యేగా, జెడ్పీఛైర్మెన్‌గా, ఆయన సతీమణి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముఖచిత్రం గీసి.. అభిమానం చాటి..



తమలో చైతన్య స్ఫూర్తిని నింపిన విద్యావంతుడు, అభిమాన నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ ముఖచిత్రాన్ని గీసి, యువకుడు తన అభిమానాన్ని చాటుకున్నాడు. మండలంలోని ఎల్లగడప గ్రామానికి చెందిన యువకుడు సజ్జు, జాన్సన్ నాయక్ పేద విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న సాయం, యువతకు భవిష్యత్తు పట్ల భరోసాను కల్పిస్తున్నారని అన్నారు. అనునిత్యం యువతకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు సజ్జు ప్రేరణపొంది జాన్సన్ నాయక్ ముఖచిత్రాన్ని గీసి ఆయనకు బహుమతిగా అందజేశారు. అనంతరం జాన్సన్ నాయక్ మాట్లాడుతూ యువత మంచి లక్ష్యాలను నిర్ణయించుకొని విజయం సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని అన్నారు.

నవతెలంగాణ-కడెం

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం నవంబర్‌, 5 2023

బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రావడం ఖాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్‌
ముఖ్యమంత్రి కేసీఆర్‌ హయాంలో గత తొమ్మిది సంవత్సరాల నుంచి చేస్తున్న అభివృద్ధి తమను తిరిగి అధికారంలోకి తీసుకువస్తుందని ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమని ఎంపీపీ మల్లికార్జున్‌ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బూరుగూడ గ్రామానికి చెందిన వారు, చిర్రకుంటలోని తన నివాసంలో ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన వారు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ పార్టీలోకి భారీ వలసలు పెరిగాయన్నారు.

కాంగ్రెస్‌ విధానం మూడు గంటల కరెంటు, బీఆర్‌ఎస్‌ విధానం మూడు పంటలకు కరెంటుఅని అన్నారు. పార్టీలో చేరిన వారిలో తిరుపతి, అశోక్‌, శ్రీనివాస్‌ గురుమూర్తి, శ్రీశైలంతో పాటు పలువురున్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు బడ్జెట్‌ కేటాయించాలి

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌

నవతెలంగాణ-పెంచికల్‌పేట్‌
మధ్యాహ్నభోజన కార్మికులకు బడ్జెట్‌ కేటాయించాలని, పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం ప్రతి విద్యార్థికి రూ.25 పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌ అన్నారు. శనివారం మండలకేంద్రంలో మధ్యాహ్నభోజన కార్మిక యూనియన్‌ సమావేశాన్ని యూనియన్‌ అధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించడానికి సరైన బడ్జెట్‌ కేటాయించకుండా కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకొనేందుకు విద్యార్థులకు అల్పాహారం అందించాలని, దానిలో భాగంగా విద్యార్థులకు ఇడ్లీ, పూరీ, బొంబాయిరవ్వ ఉప్మా, కిచిడి, దానికి సంబంధించిన చెట్నీలను తయారుచేసి విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం జీఓను జారీ చేసిందని, దానికి సంబంధించిన డబ్బులు ఇవ్వకపోవడంతో మధ్యాహ్నభోజన కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. ఒక్కో విద్యార్థికి రూ.10.50 పైసలు చెల్లించి అల్పాహారం అందజేయాలని, ఉదయం ఎనిమిది గంటలలోపు అల్పాహారం అందించాలని అధికారులు ఆదేశించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పథకం సజావుగా సాగాలంటే ప్రతి విద్యార్థికి రూ.25 అల్పాహారానికి చెల్లించాలని, వంట సామగ్రి, గ్యాస్‌ తదితర సామగ్రి కోసం బడ్జెట్‌ కేటాయించాలని, కోడిగుడ్లు సైతం ప్రభుత్వ ధర కంటే మార్కెట్‌ ధర ఎక్కువగా ఉందని, ఉడుకపెట్టిన గుడ్లకు రూ.ఎనిమిది చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు సిడాం యశోద, లావణ్య, కరుణాకర్‌, కమల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్‌

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాజీనామా



నవతెలంగాణ-ఆసిఫాబాద్‌
బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొమరం వందన పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ తనకు టికెట్‌ ఇస్తుందని ఇంత కాలం నమ్మబలికారని ఆరోపించారు. పార్టీలో మహిళలకు చోటు లేకుండా పోయిందన్నారు. పార్టీ వైఖరిని నిరసిస్తూ రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎప్పటినుండో పార్టీని పట్టుకొని ఉన్న వారికి గుర్తింపు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు.

బీఆర్‌ఎస్‌ శ్రేణుల ప్రచారం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్‌
మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచులు సుధాకర్‌, చంద్రమౌళి, కళావతి, ఎంపీటీసీ రాజన్న, నాయకులు శ్రీనివాస్‌, కృష్ణ, రాజన్న, రామన్న, చలం, బండన్న, సదాశివ్‌ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-వాంకిడి
మండలంలోని సవాతి, డాబా, అంతాపూర్‌, కొలంగూడ, లంబాడితాండ, లొద్దిగూడ, ఎనగొంది, నవెదరి, మర్కగూడ, ఆర్లీ, రాజీవ్‌నగర్‌ వివిధ గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోవలక్ష్మిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పట్టించుకోని పార్టీలను నమ్మవద్దని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే సామాన్య ప్రజలకు ఇంకా 14 పథకాలను ప్రవేశపెడుతున్నారని, ఇందులో రూ.ఐదు లక్షల కేసీఆర్‌ బీమా, అందరికి సన్న బియ్యం, రూ.5016 ఆసరా పెన్షన్‌, రూ.16 వేలు రైతుబంధు, రూ.15 లక్షలు ఆరోగ్య సురక్ష, సౌభాగ్యలక్ష్మి కింద అర్హులైన నిరుపేద కుటుంబాల మహిళలకు జీవనభృతి, రూ.400లకే గ్యాస్‌ సిలిండర్‌ లాంటి పథకాలను నిరుపేదల కోసం ప్రవేశపెట్టనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తుకారాం, పీఏసీఎస్‌ చైర్మన్‌ జాబిరె పెంటు, సవాతి ఎంపీటీసీ మారుతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మోనిటరింగ్‌ కమిటీ సభ్యుడు ఇయాస్‌, పీఎసఐ జిల్లా అధ్యక్షుడు అశోక్‌ మౌల్కార్‌, సవాతి ఉప సర్పంచ్‌, ఐటీడీఏ డైరెక్టర్‌ సోయం భీంరావు, మాజీ ఎంపీటీసీ వినోద్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు సదాశివ్‌, సత్యానారాయణచారి, మల్లయ్య పాల్గొన్నారు.

బెజ్జూర్‌ : మండలకేంద్రంలోని కుమ్మరివాడ, మన్నెవార్‌ కాలనీల్లో శనివారం బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్‌ యూత్‌ అధ్యక్షుడు కొండ్ర నరేందర్‌గౌడ్‌, జాహిద్‌ హుస్సేన్‌, షౌకత్‌ అలీ ఖాన్‌, పుల్లూరి సతీష్‌కుమార్‌, సహీర్‌ అలీ, పాషాబాయ్‌, రంగు సురేష్‌గౌడ్‌, షేర్‌ ఖాన్‌, కొండ్ర సురేష్‌ గౌడ్‌, భక్తు కేశవ్‌, నజీర్‌, పోలాజీ, సత్యన్న, వెంకటి పాల్గొన్నారు.



ఇంటింట పచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

సిర్పూర్‌ ఎమ్మెల్యేగా కోనప్పను గెలిపించండి



నవతెలంగాణ-దహెగాం
సిర్పూర్‌ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని కొత్మీర్‌ గ్రామంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందాయని, మళ్ళీ కారు గుర్తుకు ఓటు వేసి సిర్పూర్‌ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపిస్తే మరిన్ని పథకాలు ప్రజలకు చేరుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లెల శంకరయ్య, షేక్‌ సోనూ, రాంటెంకి మల్లేష్‌, సంతోష్‌, సిద్ధం వసంత్‌, కోలాల అజయ్‌ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్‌పీని ఆదరించాలి

• బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి

నవతెలంగాణ-సిర్పూర్‌(టి)
అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్‌పీని ఆదరించి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక వారసంతలో బీఎస్‌పీ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఎన్నికల బరిలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను బరిలో దింపామని తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం జరగాలంటే కేవలం బీఎస్‌పీతోనే సాధ్యమని అన్నారు. ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడకుండా గత 76 సంవత్సరాలుగా ఓట్లు వేయించుకొని వారి బాగోగులు పట్టించుకోవడంలో విఫలమయ్యాయన్నారు. పేదలు పేదవారిగానే, ధనవంతులు ధనవంతులులాగానే ఎదుగుతున్నారే తప్పా దీనికి వ్యతిరేకంగా బీఎస్‌పీ పార్టీ స్థాపకుడు కాంసిరామ్‌ నాటి పరిస్థితులను ఆలోచించి భవిష్యత్తులో పేదవారికి రాజ్యాధికారంతో పాటు సామాజిక న్యాయం జరగాలని కలలు కన్నారని, ఆయన ఆశయాలను సాధించే వరకు మనమందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి శ్రీరామన్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీన్‌, అసెంబ్లీ సెక్రటరీ నగరాడే రాజు, ఎంపీటీసీ మంగిలాల్‌, జిల్లా మైనార్టీ కన్వీనర్‌ షేక్‌ చాంద్‌, సుభాష్‌, ఇప్ప స్వామి, నందాజీ, సునీల్‌, బీఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.



వారసంతలో ప్రచారం నిర్వహిస్తున్న బీఎస్‌పీ నాయకులు

నేరాల నియంత్రణకే కార్డెన్‌ సెర్చ్‌

నవతెలంగాణ-పెంచికల్‌పేట్‌
శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకే కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్‌ డీఎస్పీ కరుణాకర్‌ అన్నారు. మండలంలోని కొండపెల్లి గ్రామంలో శనివారం కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువ పత్రాలు లేని 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయమని, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కోడిపందాలు, గుడుంబా, మట్కా వంటి వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని లోడ్‌పెల్లి గ్రామంలో పోలీసు బలగాలతో ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ నాగరాజు, పెంచికల్‌పేట్‌, దహెగాం ఎస్సైలు కొమురయ్య, సనత్‌కుమార్‌ పాల్గొన్నారు.



నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం నవంబర్, 5 2023



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని గణేష్ హోటల్ నుంచి రామాలయం వరకు కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సందర్భంగా లక్షెట్టిపేట సీఐ కృష్ణ జన్నారం ఎస్సై సతీష్‌లు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరపడానికి పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిది అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని గ్రామాలలో, శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. ఈ ఫ్లగ్ మార్చ్‌లో దాదాపు 150 మంది కేంద్ర బలగాలు పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు బీఆర్ఎస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు సాధ్యమని సిర్పూర్-యూ జెడ్పీటీసీ కోవా అరుణ అన్నారు. శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండలంలోని చోర్‌గావ్, మధుర తాండ, గొండ్‌గూడ, సుంగాపూర్ తాండ, కొలాంగూడ, చిత్తగూడ, బాబేఝరి, మాంగ్రి, ధానుగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ అడే సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యుర్వేతా రూప్‌దేవ్, సర్పంచ్ గజానంద్ నాయక్, మాజీ జెడ్పీటీసీ రూపావతి జ్ఞానోబా పుష్కర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, మండల అధ్యక్షుడు మేస్రం హనుమంత్‌రావ్ పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తును పరిశీలించిన ఏసీపీ

నవతెలంగాణ-తాండూర్

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన బందోబస్తును శనివారం బెల్లంపెల్లి సబ్ డివిజన్ ఏసీపీ సదయ్య పరిశీలించారు. బందోబస్త్ నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. నామినేషన్ వేసే నాయకులు ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు లోబడి ఉండాలని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ ఆఫీసులోకి అనుమతించబడుతుందని తెలిపారు. నిర్ణీత ప్రదేశం నుంచి 100 మీటర్ లోపలికి ఎటువంటి ర్యాలీలకు గాని వాహనాలకు గాని అనుమతి లేదని తెలిపారు. ఆయన వెంట వన్ టౌన్ ఎస్సై బన్సీలాల్ ఉన్నారు.



బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేఖానాయక్ విరుచుకుపడ్డారు. శనివారం మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్ రజాక్, పాక్స్ డైరెక్టర్ మున్నా ఆధ్వర్యంలో జన్నారం సర్పంచ్ గంగాధర్, టౌన్ ప్రెసిడెంట్ షేక్ మౌలానాలతో పాటు దాదాపు 100 మందికి పైగా కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే రేఖానాయక్, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌లు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ మాటతప్పారని, కేటీఆర్ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని అన్నారు. కేటీఆర్ తన ఫ్రెండ్ కోసం తనకు టికెట్ ఇవ్వలేదని, ప్యారషూట్ మీద వచ్చిన వారిని ప్యారచూట్ లోనే పంపిద్దామన్నారు. దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, నిరుద్యోగ బృతి, ఇంటికొక ఉద్యోగం ఇస్తానని చెప్పి కల్లబొల్లి మాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక్కొక్కరు 100 మందితో చేతి గుర్తుకు ఓటు వేయించాలని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా అమ్మకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపును బహుమతిగా ఇవ్వాలని అన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసి ఖానాపూర్ నియోజకవర్గంలో బొజ్జు పటేల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని అన్నారు. అనంతరం కర్ణాటక ఎమ్మెల్సీ, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రకాష్ రాథోడ్, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. గత 9 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందలేదు కానీ, కల్వకుంట్ల కేసీఆర్ కుటుంబం మాత్రం అభివృద్ధి చెందిందని అన్నారు. రానున్న ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటు వేసి అటు రాష్ట్రంలో ఇటు నియోజకవర్గంలో కాంగ్రెస్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, ఏనుగు సుభాష్‌రెడ్డి, మిక్కిలిని రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, ఫసి ఉల్లా, కరుణాకర్, రమేష్, ఇసాక్, ముత్యం రాజన్న, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్ షా, రమేష్, కోవా భూమయ్య, శాంతయ్య ప్రదీప్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీఅర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని లక్షెట్టిపేట్ మున్సిపల్ చైర్మన్ నాల్మాసు కాంతయ్య అన్నారు. శనివారం లక్షెట్టిపేట 15వ వార్డులో కౌన్సిలర్ సజ్జు, కోఆప్షన్ సభ్యుడు షాహిద్ అలీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్మాస్ కాంతయ్య మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఉపయోగపడేలా మేనిఫెస్టో ఉందన్నారు. ఇక్కడి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా వున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, మైనారిటీ నాయకులు షేక్ చాంద్ పాల్గొన్నారు.



రూ.వేల కోట్ల నిధులతో నియోజకవర్గం అభివృద్ధి

- బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గాన్ని రూ. వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేయడం జరిగిందని సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. శనివారం తన నివాసగృహంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతతో కలిసి చెన్నూర్ ప్రజా ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి మాట్లాడుతూ ప్రజా ప్రస్తానం పుక్తంలో ఇక్కడ చేసిన అభివృద్ధి పనులు అందుకు ఖర్చు చేసిన నిధులు, పనుల ఆవశ్యకత క్లుప్తంగా వివరించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల చిరకాల కల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసుకోగలిగామని అన్నారు. అంతే కాకుండా భీమారం, పారుపల్లి, ఆస్నాద్, క్యాతన్‌పల్లి, చెన్నూర్ మున్సిపాలిటీ చేసుకోవడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గంలో అభివృద్ధి చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగాలన్న లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. అభివృద్ధి లక్ష్యంగా ఇక్కడ పని చేసుకుంటుపోతున్నామని, గతంలో ఎవ్వరు చేయలేనంత అభివృద్ధిని ఇక్కడ చేసి చూపించడం జరిగిందని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని విడిచిపోయేది లేదని నా ఊపిరి ఉన్నంత వరక



ప్రజా ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాల్క సుమన్

నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని చివరికి నేను చచ్చినా నా అస్థికలు ప్రాణహితలోనే కలుపడం జరుగుతుందని అన్నారు.

కొత్తపెల్లిలో సామూహిక సీమంతాలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కొతపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పౌష్టికాహార విలువలను ముర్రుపాల ఆవశ్యకతను గర్భిణీలకు, బాలింతలకు వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహార పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలలో అంగన్‌వాడీ టీచర్ స్వప్న, ఏఎన్ఎం నవిత, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, లక్ష్మీ, ఆశా కార్యకర్తలు అనురాధ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన రేచిని సర్పంచ్ దుర్గుబాయి

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచీని గ్రామ సర్పంచ్ చింతపూర్ దుర్గ బాయి శనివారం బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఈసా సిరాంగిశంకర్ సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. గ్రామపంచాయతీ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరారు. ఈ కార్యక్రమంలో మాసాడి తిరుపతి పాల్గొన్నారు.

ఆగాఖాన్ అకాడమీ ఇంటర్వ్యూకు ఎంపికైన సీఓఈ విద్యార్థి



నవతెలంగాణ-తాండూర్

ప్రతిష్టాత్మకమైన అగాఖాన్ అకాడమీ 3దశలుగా నిర్వహించిన టాలెంట్ టెస్టులో బెల్లంపల్లి సీఓఈ విద్యార్థి నిచ్చకోల రుషికేష్ ఇంటర్వ్యూకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగాఖాన్ అకాడమీ ప్రతిభగల విద్యార్థులను పలు దఫాలుగా ప్రత్యేక టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తుందని తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు రీజినల్ స్థాయిలో మరో పరీక్ష నిర్వహించగా బెల్లంపల్లి సీఓఈకి చెందిన విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1500 మంది పోటీ పడిన ఈ పరీక్షలో 5 మందిని మాత్రమే ఇన్‌టర్వ్యూకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ ఇన్‌టర్వ్యూలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆరవ తరగతి నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్యను అగాఖాన్ అకాడమీ అందించనున్నట్లు తెలిపారు. శనివారం బెల్లంపల్లిలో విద్యార్థి రుషికేష్ ను వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్ కుమార్, బీజేపీ కొక్కుల రాజేశ్వర్, హారిక, ఉపాధ్యాయులు స్రవంతి, శాతరాజు తిరుపతి, పొన్నం శ్రీనివాస్ అభినందించారు.

డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయ సేవలు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాదు గ్రామీణ మండలం రాజుగూడా తండాను శనివారం సందర్శించామన్నారు. గత సంవత్సరం పారుబాయి అనే గిరిజన మహిళా పాపకి జన్మనిచ్చి మరణించిందని, 11 నెలలుగా డీఎల్ఎస్ ద్వారా పాప బాగోగులు చూస్తున్నామన్నారు. ప్రస్తుతం పాప తన తండ్రి బాపురావు సంరక్షణలో ఉందన్నారు. నిత్యావసర సరుకులు, బట్టలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పాపకు బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు ఇప్పించి సుకన్య సంవృద్ధి యోజన పథకం క్రింద డీఎల్ఎస్ఏ ద్వారా రూ.10 వేలు జమచేస్తామన్నారు. చదువుతో పాటు సంక్షేమ పథకాలు అందేలా, తండ్రికి ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామానికి రోడ్డు, త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు అధికారుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆదిలాబాదు గ్రామీణ మండలం లోహరి గ్రామంలో ఉచిత న్యాయ సేవాసదస్సు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఉచిత న్యాయసహాయం కోసం డీఎల్ఎస్ఏను సంప్రదించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్

పతి కోసం సతీ ప్రచారం

● విస్తృతంగా పర్యటించిన మౌనరెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు కాలనీల్లో పర్యటిస్తూ గెలిపించాలని కోరుతున్నారు. తండ్రి కోసం కొడుకు, మామ కోసం అల్లుడు, పతి కోసం సతి ఇలా ప్రచారంలో ఉంటున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి కంది సాయి మౌనారెడ్డి శనివారం పట్టణంలోని ఒకటవ వార్డు పరిధిలోని ఖైజవాన్ నగర్, మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మీనగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ క్యాంపెయిన్ నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలకు సంబంధించి కరపత్రాలను పంచుతూ చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. అంతకు ముందు



మర్వాడి ధర్మశాలలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంకటమోచన విజయ్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించి తన భర్తకు విజయం దక్కాలని వేడుకున్నారు. ఈసందర్భంగా ఆమె సమక్షంలో మహాలక్ష్మివాడ మాజీ కౌన్సిలర్ కుసుమ లింగారెడ్డి దంపతులు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కంది సాయిమౌనారెడ్డి శాలువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.

బీఆర్ఎస్‌కు భీంసరి ఎంపీటీసీ రాజీనామా



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎమ్మెల్యే జోగు రామన్న భీంసరి వాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చి మాట తప్పడం, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించడంతో తనపై ఆరోపణలు చేయడంతో అధికార పార్టీ భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. శనివారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజీనామా పత్రాన్ని ప్రదర్శిస్తూ మాట్లాడారు. రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే జోగు రామన్న తమ గ్రామానికి బ్రిడ్జిని నిర్మిస్తానని హామీ ఇచ్చి ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేన్నారు. అడిగిన తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే గ్రామంలో సవారి బంగ్లా షెడ్, పాఠశాల నుంచి ఆటో స్టాండ్ వరకు డబుల్ రోడ్డు, హామీ ఇచ్చిన విస్మరించిన ఎమ్మెల్యే తీరుకు నైతిక బాధ్యత వహిస్తూ పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ అయినా తమ డిమాండ్లను లిఖితపూర్వకంగా నెరవేరుస్తామని రాసి ఇస్తేనే ఆ పార్టీని ఆదరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భీంసరి గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి రీజియన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్ అన్నారు. శనివారం డిపోలో నిర్వహించిన రీజనల్ స్థాయి ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంధనాన్ని పొదుపు చేసి, అధిక రాబడి తీసుకువచ్చి సంస్థను లాభాల బాటలో నడిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన డ్రైవర్లు రవీందర్, కండక్టర్ లక్ష్మణ్, అద్దె బస్సు డ్రైవర్ శంకర్, మెకానిక్ వెల్డర్ సురేష్‌లను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఓ) ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం(మెక్) ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామన్నకు నిరసన సెగ

నవతెలంగాణ-జైనథ్

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని పార్డీ-కే గ్రామంలో ఎమ్మెల్యే రామన్నకు నిరసన సెగ తగిలింది. గ్రామస్తులు ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు రామయి, పార్డీ-కే మధ్యన వంతెనను నిర్మించలేదని నిలదీశారు. ఫ్లకార్డులు పట్టుకొని నిరసనను తెలియజేస్తూ వంతెన నిర్మాణాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను పూర్తి చేయకుండా ప్రచారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.



ఎన్నికల వ్యయ పరిశీలకుడిని కలిసిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాకు వచ్చిన వ్యయ పరిశీలకులు ప్రద్యుమ్నీల్ రాంరావ్ జుంలే(ఐఆర్ఎస్)ను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి కలిశారు. శనివారం స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, భద్రతా పరంగా తీసుకుంటున్న అంశాలను గురించి వ్యయ పరిశీలకుడికి ఆయన తెలియజేశారు.

కోరం లేక సర్వసభ సమావేశం వాయిదా

నవతెలంగాణ-తాంసి

కోరం లేక భీంపూర్ మండలం సర్వసభ సమావేశం వాయిదా పడింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ రత్నా ప్రభ ఒక్కరే హాయారయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయిలో అధికారులు రాని కారణంగా కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వెస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ప్రకటించారు.

అంతరిస్తున్న కొలాం ఆదివాసీ భాషను కాపాడాలి

● జిల్లా కేంద్రంలో కుమురం సూరు విగ్రహాన్ని ప్రతిష్టించాలి : పూసం సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతరించి పోతున్న ఆదివాసీ తెగ, వారి భాషలను కాపాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య భవనంలో ఆదివాసీ పోరాట యోధుడు కుమురం సూరు 26వ వర్ధంతి సభ



ఆదిలాబాద్‌లో కుమురం సూరుకు నివాళులర్పిస్తున్న టీఏజీఎస్ నాయకులు

నిర్వహించారు. ముందుగా కుమురం సూరు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురంభీంతో పాటు కుమురం సూరు ఆదివాసీల కోసం నిజాం ప్రభుత్వ దౌర్జన్యంపై పోరాడారని తెలిపారు. జల్ జంగల్ జమీన్‌పై హక్కు ఆదివాసీలకే ఉందని గర్జించిన యోధుడని కొనియాడారు. ఆదివాసీ కొలం తెగ, భాషా అంతరించే పరిస్థితి ఉందని, దానిని కాపాడాలని కోరారు. ఆదివాసీ వ్యతిరేక నూతన అటవీ సంరక్షణ చట్టం వెనక్కి తీసుకోవాలని, జీవో 3ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కొలాం భాష అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకొని కాపాడాలన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచేలా ఐటీడీఏ పరంగా రుణ సదుపాయాలు, పోషక ఆహారం, గ్రామాలకు రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. పీవీటీజీ తెగలు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు జీసీసీ ద్వారా సరైన మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడవిలో సేకరిస్తున్న బొంగు కట్టెకు ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా రాఘవులు, ఆడ అర్జున్, మెస్రం మహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆశన్న, కార్యదర్శి కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి పాల్గొన్నారు.

ఉట్నూర్ : అమరజీవి కొలాం వీరరత్న కుమురం సూరు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుస్రం నీలబాయి అన్నారు. మండలంలోని గోండుగూడా పంచాయతీ పరిధిలోని కొలంగూడలో శనివారం కుమురం సూరు 26వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమానికి ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై సూరు విగ్రహానికి పులామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసి నేలరాలిన అమర వీరుడు కుమురం భీంతో పాటు కుమురం సూరు ఒకరన్నారు. జాతి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరు వారసులు లేతు, కార్యనిర్వహణ కమిటీ ఛైర్మెన్ మడావి రాజేశ్వర్, వైస్ ఛైర్మెన్ ధర్ము, కన్వీనర్ కుమ్ర రాజు, కోకన్వీనర్ టెకం భీము, కొలం సంఘం నాయకులు బాపురావు, ముకుంద్ రావ్ ఉన్నారు.



ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు

ఐకేరెడ్డిని మరోసారి గెలిపించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ఐకేరెడ్డిని మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, అడెల్లి ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వంజర్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రైతుల అభివృద్ధి సాధ్యమైందన్నారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, మరింత అభివృద్ధి చెందాలంటే ఇంద్రకరణ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. వారి వెంట సర్పంచ్ లస్మయ్య, డైరెక్టర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొనసాగుతున్న బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలో బీఆర్ఎస్ ప్రచారం కొనసాగుతుంది. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. శనివారం బీఆర్ఎస్ ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ ఛైర్మెన్, ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, లింగోజీ తండా సర్పంచ్ హరి మండలంలోని పెర్కగూడ గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ ప్రభుత్వ పథకాలు, పార్టీ మెనోఫేస్టో గురుంచి వివరించి, పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, రవీందర్, హరీష్, స్వామి, ప్రకాష్, భీంరావు, వినోద్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు వలసల దారి పట్టారు. పార్టీలో తమకు గుర్తింపు లేదని భావించి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఐటీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ నుండి పుర్క బాపురావు, పెందుర్ ప్రభాకర్, కోట్నక్ రమేష్, మంగం విషంరావ్ చేరారు. కాంగ్రెస్ నుండి ఆదివాసీ, ముఖ్యనాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారనున్నాయి. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని కేటీఆర్ సూచించారు.

రేపు దరఖాస్తులకు చివరి గడువు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లీష్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులకు సోమవారం చివరి గడవని ప్రిన్సిపాల్ సుధారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పీజీ, బీఈడీ మెథడాలజీతో పాటు బోధనలో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

బీఆర్ఎస్ అవినీతి కాంగ్రెస్‌కు వరం లాంటిది

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బీఆర్ఎస్ 9 సంవత్సరాల పరిపాలనలో చేసిన అవినీతి కాంగ్రెస్‌కు వరం లాంటిదని డిసిసి జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. చిన్న దాంపూర్ ఉపసర్పంచ్ సీతారాంతో పాటు పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర సాధన తర్వాత 9ఏళ్లలో రాష్ట్రంలో అవినీతి పెచ్చు మీరిపోయిందన్నారు. జిల్లాలో పార్టీని గెలిపించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ వైపే ఉన్నట్లు వివరించారు. పార్టీ అభ్యర్థి శ్యాంనాయక్ నివాసంలో రెబ్బెన మండలానికి చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అసద్, ఖలీం, రాపర్తి మురళి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా మండలంలోని చిలాటిగూడలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఎండి.ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మసదే చరణ్, వినోద్, పిప్పిరి మహేష్, ప్రదీప్, మొహ్మద్ ఇస్మాయిల్, పోడుపుగంటి హరీష్, అతీక్, సమీర్, అయాన్, అయాన్‌ఖాన్, కిరణ్, కృపాకర్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ తన అనుచరులతో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని మందపల్లి గ్రామంలో ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు దళితబంధువు అమలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటోందని తెలిపారు. తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, పార్టీ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర్య జనార్దన్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, ఫజల్, తాళ్లపల్లి రాజేశ్వర్, భరత్ కుమార్, శ్రీపతి బుచ్చన్న, జాడి శంకర్ పాల్గొన్నారు.

నిన్న ఆ పార్టీ, నేడు ఈ పార్టీ.. మళ్ళీ అదే పార్టీలోకి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళా ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కాగా తమ పార్టీలో చేరికలపై దృష్టి సారించాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రతినిత్యం ప్రచారంలో భాగంగా చేరికలు జరుగుతున్నాయి. ఈ పార్టీ నుండి ఆ పార్టీకి, ఆ పార్టీ నుండి ఈ పార్టీకి నాయకులు చేరుతున్నారు. అయితే తాజాగా కేఆర్‌కే కాలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సంతోష్ చేరికతో రాజకీయం నెలకొంది. బీఆర్ఎస్‌కు చెందిన ఆయన మూడు రోజుల క్రితం బీజేపీ కండువా కప్పుకున్నారు. మళ్ళీ మరుసటి రోజు ఎమ్మెల్యే రామన్న సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా శనివారం మళ్ళీ ఆ నాయకుడు మీడియాతో మాట్లాడుతూ బీజేపీలోనే కొనసాగుతానని బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే బలవంతంగా పార్టీ కండువా కప్పినట్లు ఆరోపించడంతో అసలేం జరుగుందో తెలియని ఆయోమయ స్థితిలో జనాలున్నారు.

గడపగడపకు బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ- కౌటాల



సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందాయని, రానున్న ఎన్నికల్లో మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ మెనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుజ్జా రమేష్, సీనియర్ నాయకులు ముజంకార్ శంకర్, వార్డుమెంబర్‌లు కానుజీ, శివరాం, రాజ్‌కుమార్, విజయ్, నికురె గణేష్, మోర్లె జయరాం, తోటపల్లి శ్రీనివాస్, ఆకాష్, నరేష్, కరేం సాయిరామ్ రెడ్డి, బట్టు శేఖర్, శంకర్, మూట నరేష్, పండే శ్రీకాంత్, షాకీర్, మండోరె శశి, మోర్లె వేణు, తిరుమల్, తిరుపతి, ఆదే దివాకర్ పాల్గొన్నారు.

10 లీటర్ల నాటుసార ధ్వంసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

10లీటర్ల నాటుసార, 7వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 11బీర్లు స్వాదీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి మండలంలోని లంబాడిహాట్టి గ్రామంలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో 10 లీటర్ల నాటుసార ధ్వంసం చేశాం. గ్రామ శివారులో 3000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, జటోత్ గోవింద్‌పై కేసు నమోదు చేశాం. గన్నారం, ఖర్జవెల్లి కిరాణా షాపుల్లో తనిఖీ చేయగా నవీన్, శైలెందర్ కిరాణా షాపులో 11 బీర్లు, రెండు ఓసీ క్వార్టర్లను స్వాదీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు. దహెగాం మండలంలో మర్రిపల్లి గ్రామ శివరులో 4000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, ఆర్. కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు ఈటెల శ్రీనివాస్, ఒడ్నాల రాజేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్ల రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, సమ్మెట రవి, నగేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియ

నవతెలంగాణ-ఉట్నూర్

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతోంది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఆర్‌ఓ కార్యాలయంలో శనివారం బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్ సతిమణి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్‌తో కలసి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ జీవాకర్ రెడ్డికి అందజేశారు. శుక్రవారం, శనివారం ఒక్కో నామినేషన్ దాఖలైంది. మొత్తం ఇప్పటి వరకు రెండు నామినేషన్లు దాఖలైనట్టు ఆర్‌ఓ జీవాకర్ రెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించాలి



నవతెలంగాణ-జైనథ్

బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరిస్తే సంక్షేమంతో పాటు మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని సుందరగిరి, మాంగుర్ల, తండాలలో విస్తృతంగా పర్యటించారు. ద్విచక్ర వాహనం, కాలియ తిరుగుతూ ఓటర్లను కలుస్తూ కారు గుర్తుని గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ గోవర్ధన్, మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ శారద ఉన్నారు.